సాక్షి నిజామాబాద్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



కొలువు దీరిన అమ్మవారు..

జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో సోమవారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. మండపాల్లో అమ్మవారు కొలువు దీరారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో విద్యుత్‌దీపాలతో వేసిన ఇంద్రకీలాద్రి సెట్టు, 51 శక్తిపీఠాలను సూచిస్తూ ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.

– నిజామబాద్ రూరల్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యూస్‌రీల్

నేడు దిశ సమావేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఆర్డీవో సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాలు నిరంతరం పని చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ఈవీఎంలను భద్రపర్చిన గోదాము వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో హరిసింగ్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఈవీఎం నోడల్ అధికారి ప్రసాద్ తదితరులతో కలిసి నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాము సీల్ ను తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామగ్రి భద్రపర్చి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. వారి వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, జితేందర్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని డిపో–1 మేనేజర్ ఆనంద్, ఆర్టీసీ విజిలెన్స్ సీఐ మహిపాల్ ప్రభాకర్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్యకు విన్నవించారు. సోమవారం సీపీని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. నిజామాబాద్ బస్ స్టేషన్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల గురించి సీపీకి వివరించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా టోర్నీలో సత్తా



నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా టోర్నీలో జిల్లా మహిళల, పురుషుల జట్లు సత్తాచాటాయి. మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 20 నుంచి సోమవారం వరకు 11వ సెపక్ తక్రా సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మహిళల, పురుషుల టోర్నమెంట్ నిర్వహించగా.. జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానంలో, పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాదారి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్ల విజయంపై అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశ వేణు, గాదారి సంజీవరెడ్డితోపాటు ఉపాధ్యక్షులు దీపిక, ల్యాబ్ గంగారెడ్డి, బాగారెడ్డి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మళ్లీ భారీ వర్ష సూచన

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు మళ్లీ భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయగా అందులో నిజామాబాద్ జిల్లా సైతం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా, సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. 4.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా నందిపేట మండలంలో 24.0 మిల్లీ మీటర్లు, నవీపేటలో 15.2, డొంకేశ్వర్‌లో 8.3, సిరికొండలో 10.7, పొతంగల్‌లో 12.3, మోస్రాలో 7.5, సాలూరాలో 8.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తొమ్మిది మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షం కురవగా, 23 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మధ్యతరగతికి భారీ ఆదా

జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వర్గాల్లో సంతోషం

- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపార, ఉద్యోగ, మహిళలు



జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వస్తువుల ధరలు తగ్గనుండడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో 5,18 శాతం శ్లాబులు మాత్రమే ఉండేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వినియోగదారులు, వ్యాపారులు, రైతులు, గృహిణులు, విద్యార్థులు, యువత తమకు భారీగా ఆదా అవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్ల ధరలు భారీగా తగ్గనుండడంతో మధ్యతరగతి వారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలాలపై 40 శాతం జీఎస్టీ విధించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ వర్గాల వారు 'సాక్షి' తో అభిప్రాయాలు పంచుకున్నారు. –సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



రైతులు ఆధునిక పరికరాలు మరింతగా కొనుక్కోవచ్చు



శ్లాబుల ధరలు భారీగా తగ్గించడంతో మానవాళికి అన్నం పెట్టే రైతులకు ఉపయోగకరం. రైతులు మరింతగా యాంత్రీకరణకు వెళ్లవచ్చు. ఆధునిక వ్యవసాయం వైపు వేగంగా వెళ్లేందుకు అవకాశం కలిగింది. ఎఫ్‌పీవోల లావాదేవీలపై పన్నులు లేకపోవడం శుభసూచకం. రైతుల ఉత్పత్తులకు ఎగుమతి సుంకాలు లేకపోవడంతో రైతులు ఎగుమతి దారులుగా మారుతారు.

– పొట్కూరి తిరుపతిరెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్

మధ్యతరగతి కుటుంబాలకు లాభమే



డిచ్‌పల్లి: ఇండ్లలో వినియోగించే ఎన్నో రకాల సామగ్రిపై జీఎస్టీ భారం తగ్గించడం మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో లాభం. తక్కువ సొమ్ముకు ఎక్కువ సామగ్రి కొనుక్కోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించడం సంతోషంగా ఉంది.

– లోకాని స్వప్న, ఇందల్వాయి



ఆత్మనిర్భర్ భారత్ దిశగా..



సామాన్యుడు, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగేందుకు ఈ జీఎస్టీ తగ్గింపు శ్లాబులు ఉపయోగపడతాయి. అదేవిధంగా స్వదేశీ ఉత్పత్తులకు మరింత వైభవం తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం కచ్చితమైన ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ఆత్మనిర్భర్‌తోనే వికసిత భారత్ సాధ్యం అవుతుంది. విద్యార్థులకు ఉపయోగపడే స్టేషనరీ లాంటి వస్తువులకు జీరో ట్యాక్స్, ఆరోగ్య బీమాకు పన్ను లేకుండా చేశారు. గ్రాసరీస్, కిరాణా, వ్యవసాయ పరికరాలు, ఔషధాలపై 5 శాతానికి పన్ను తగ్గించారు. చిన్న కార్లు, బైకులు, కంప్యూటర్లు, వివిధ రకాల గృహోపకరణాలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలకు మరింత మేలు కలుగనుంది. – అర్వింద్, ఎంపీ

జీఎస్టీ తగ్గింపు ఊరటనిచ్చే అంశం





అనేక రకాల సామగ్రిపై జీఎస్టీ తగ్గించడం ఎంతో ఊరటనిచ్చే అంశం. జీఎస్టీ తగ్గింపు వల్ల ధరలు తగ్గడంతో పాటు కొనుగోళ్లు పెరగడానికి అవకాశం ఉంది. సామాన్యులకు ఆర్థిక భారం తగ్గుతుంది. విలాసవంతమైన సామగ్రిపై జీఎస్టీ భారం ఉన్నా మధ్య తరగతి వారికి ఎలాంటి ఇబ్బంది లేదు.

– లక్ష్మీనారాయణ, లెక్చరర్, జూనియర్ కళాశాల మోర్తాడ్

ఆటో మొబైల్ రంగానికి ఊపు






వాహనాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ఆటో మొబైల్ రంగానికి ఊపు వస్తుంది. వాహనాల ధరలు తగ్గడంతో సామాన్యులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ఆహార పదార్థాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా సామాన్యులకు మాత్రం మంచి విషయం.

– జక్కం అశోక్, ఆటోమొబైల్స్ వ్యాపారి, మోర్తాడ్

నిత్యావసరాల ధరలు తగ్గడం సంతోషం





మెడికల్ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు మహిళలకు ఆర్థికభారం తగ్గించే మార్గం సంతోషంగా ఉంది. పేద, మధ్య తరగతుల ప్రజలకు ఆర్థిక భారం తగ్గడంతో కుటుంబ నిర్వహణ సులభతరం అవుతుంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

– రాజమణి, ఆర్మూర్

తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలి

- తగ్గిన ట్యాక్స్ వివరాలను బోర్డులపై ప్రదర్శించాలి
- రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె. హరిత



నిజామాబాద్‌నాగారం: జీఎస్టీ తగ్గిన వివరాలు అందరికీ అర్థమయ్యేలా వ్యాపారులు బోర్డులపై ప్రదర్శించాలని, అధికారులు మరింత అవగాహన కల్పించాలని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ కె హరిత అన్నారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన కమిషనర్.. డివిజన్ పరిధిలో పన్నుల వివరాలు, ఆదాయ లక్ష్య సాధన, జీఎస్టీలో ఇటీవల జరిగిన మార్పులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిటర్నులు సమయానికి, సక్రమంగా దాఖలు చేయాలన్నారు. వినియోగదారులకు ఆ ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. బోధన్ చలాన్ స్కామ్‌కు సంబంధించిన పాత బకాయిలపై సమీక్షిస్తూ.. కచ్చితంగా చెల్లించాల్సిందేనని రైస్‌మిల్లర్స్‌ను ఆదేశించారు. తక్షణమే పెండింగ్ బకాయిలు క్లియర్ చేయాలన్నారు. చెల్లించని వారికి ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయన్నారు. చెక్కుల కేసులను సర్కిల్ వారీగా సమీక్షించిన కమిషనర్.. వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాయింట్ కమిషనర్ గోపాల్‌రావు, మేనేజర్ ఈశ్వర్, సీటీవోలు, ఏసీటీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించాలి

- వైభవంగా బతుకమ్మ సంబురాలు
- అన్ని శాఖలు భాగస్వాములు కావాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ సంబురాలను జిల్లాలో వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా శాఖల జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ బతుకమ్మ వేడుకల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నేపథ్యంలో జిల్లాలో వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేయాలని, ముఖ్య కూడళ్లు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రదేశాల్లో హోర్డింగ్స్, బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలతోపాటు నిమజ్జనం చేసే నీటి వనరుల వద్ద లైటింగ్, సౌండ్ సిస్టమ్ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 26వ తేదీన ఎడపల్లి మండలం అలీసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్వహించనున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, పెద్ద ఎత్తున మహిళలు, యువతులు, బాలికలతోపాటు మహిళా ఉద్యోగులు పాల్గొనేలా చూడాలని, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఉత్సవాల్లో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని, ప్రతి రోజూ ఒక శాఖ తరఫున బతుకమ్మ పండుగను నిర్వహించాలన్నారు. 30వ తేదీన సద్దుల బతుకమ్మను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో రాజశ్రీ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేశ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం ఉత్సాహంగా..

- సంస్కృతి సంప్రదాయల వైభవాన్ని చాటుతూ సంబురాలు
- బతుకమ్మ, దేవీ నవరాత్రులు, శ్రీరామనవమి..
- పండగ ఏదైనా పెరుగుతున్న ప్రాధాన్యం
- ఇందూరుకు ప్రత్యేకం వీరహనుమాన్ విజయయాత్ర, ఊర పండుగ



బతుకమ్మలతో రెడ్డి రీఫామ్ సొసైటీ సభ్యులు



లక్ష్మి కల్యాణ మండపంలో బతుకమ్మ ఆడుతున్న రెడ్డి రీఫామ్ సొసైటీ సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కేంద్రంలో స్థానికంగా ఉన్న వివిధ వర్గాల ప్రజలతోపాటు దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తున్నారు. దీంతో ఉత్సవం ఏదైనా ఉత్సాహంగా, ఘనంగా నిర్వహిస్తున్నారు. భవసార్ క్షత్రియ సమాజ్, సింధీ, మార్వాడీ సమాజ్‌ల ఆధ్వర్యంలో చేసే పండుగలకు ప్రాధాన్యం ఉంటోంది. దీంతో దుర్గా నవరాత్రులు, గణపతి ఉత్సవాలు, శ్రీరామనవమి, శివరాత్రి, హోళీ ఉత్సవాలను కలసికట్టుగా చేసుకుంటున్నారు. ఇక ఇందూరుకే ప్రత్యేకమైన ఊర పండుగ, వీరహనుమాన్ విజయ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే రాష్ట్రంలో సంప్రదాయ ఉత్సవమైన బతుకమ్మ ఉత్సవాల విషయంలో మాత్రం జిల్లాలో రానురాను మరింత కళ వస్తోంది. మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ ఉత్సవాలు చేసుకుంటున్నారు. ఇందుకోసం భారీ స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కమిటీలు వేసుకుంటున్నారు.

రెడ్డి రీఫామ్ ఆధ్వర్యంలో బతుకమ్మ

నగరంలోని లక్ష్మి కల్యాణ మండపంలో రెడ్డి రీఫామ్ మహిళల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టాయి. మాజీ ఎంపీ కేశ్‌పల్లి గంగారెడ్డి సతీమణి లక్ష్మీకాంతమ్మకు వచ్చిన ఆలోచనతో రెడ్డి రీఫామ్ సొసైటీ ఏర్పాటు చేశారు. రెడ్డి కులస్తులు ఆడంబరంగా నిర్వహిస్తున్న శుభకార్యాలు, వివాహాలకు భారీ ఖర్చు చేస్తున్నారని, ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు ప్లాస్టిక్ నిషేధంలో తమవంతు పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. వంటలు సైతం ఎక్కువగా చేసి ఆహారాన్ని వృథా చేయొద్దనే నినాదాన్ని వినిపించేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ఆస్తులు అమ్ముకునే స్థాయిలో వేడుకలు చేయొద్దని ప్రచారం చేస్తున్నారు. 'సింపుల్ వెడ్డింగ్, సింపుల్ లివింగ్, సింపుల్ ఈటింగ్, విమెన్ వెల్ఫేర్, స్టూడెంట్ వెల్ఫేర్' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారు. బతుకమ్మ వేడుకల్లో లక్ష్మీకాంతమ్మ, ఇందిరారెడ్డి, సరళ మహేందర్‌రెడ్డి, డాక్టర్ కవితారెడ్డి, నల్ల స్రవంతిరెడ్డి, విశాలిని రెడ్డి, సృజనరెడ్డి, సౌజన్యరెడ్డి, సంగీతరెడ్డి, స్వరూపారెడ్డి, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉండేందుకే..



రెడ్డిల్లోని పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ సొసైటీ స్థాపించాం. పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చే లక్ష్యంతో సమష్టిగా ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్తున్నాం.

– ఇందిరారెడ్డి, రెడ్డి రీఫామ్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు

సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యం



సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తూ ధనిక, పేద, మధ్యతరగతి అనే తేడా లేకుండా అన్ని పండుగలు కలసికట్టుగా చేసుకోవాలనే విధంగా సొసైటీ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నాం. కుటుంబ కార్యక్రమాలను ఆడంబరంగా కాకుండా సాధారణంగా నిర్వహిస్తూ డబ్బులు వృథా చేయకుండా చూస్తాం.

– సరళ మహేందర్‌రెడ్డి, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి

సామాజిక స్పృహతో..



రెడ్డి సమాజంలో మహిళలు సామాజిక స్పృహతో ముందుకెళ్లాలనే లక్ష్యంతో ఈ సొసైటీని ఏర్పాటు చేశాం. వ్యక్తిగత, కుటుంబ వేడుకలు, వివాహాలు ఆర్భాటంగా, ఆడంబరంగా చేసి డబ్బులు వృథా చేయడానికి బదులు పిల్లల చదువుకు ఉపయోగించాలని, పేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సొసైటీ పనిచేసేందుకు సూచనలు ఇచ్చాను.

– లక్ష్మీకాంతమ్మ, సొసైటీ ఫౌండర్

భూసేకరణను నెలాఖరులోగా పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, తదితరులు

నిజామాబాద్‌అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన స్థల సేకరణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సీఎం సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దసరాకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూములకు పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో వికాస్‌మీనా, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, ప్రగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్‌ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలో ఓపెన్‌ ఇంటర్‌, పది సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఓపెన్‌ 10వ తరగతి పరీక్షల్లో భాగంగా నిర్వహించిన తెలుగు పరీక్ష 38 మంది రాయగా 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఓపెన్‌ ఇంటర్‌ పరీక్షలకు 86 మంది హాజరుకాగా, 23 మంది గైర్హాజరయ్యారు.

దుర్గామాతకు సీపీ పూజలు



ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్స్‌ దుర్గా పరమేశ్వరీ మాత మందిరంలో మొదటి రోజు సోమవారం బాల త్రిపుర సుందరి అమ్మవారికి నిర్వహించిన పూజలో సీపీ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నవరాత్రులు నూతన శక్తి , భక్తి , విజయానికి ప్రతీకలన్నారు. ఉత్సవాలు సమాజంలో శాంతి, సామరస్యత, సద్భావనలకు దోహదపడతాయన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్‌) బస్వారెడ్డి, రిజర్వ్‌ సీఐ శ్రీనివాస్‌ (అడ్మిన్‌), ఎంటీవో శేఖర్‌ బాబు, తిరుపతి (వెల్ఫేర్‌), సతీశ్‌ (హోంగార్డ్స్‌), ప్రధాన అర్చకులు జోషి వెంకటేశ్‌ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో యువత

- దుర్గామాతకు ఏటా పెరుగుతున్న భక్తులు
- మాలధారణతో క్రమశిక్షణ, భక్తిభావం
- పిల్లలు, మహిళల్లో సైతం దుర్గమ్మ సేవపై ఆసక్తి



డొంకేశ్వర్‌లో మాల ధరించిన యువకులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఆది పరాశక్తిగా భావించే దుర్గామాతకు ఏటా భక్తులు పెరుగుతున్నారు. యువత ఎక్కువ సంఖ్యలో మాలను ధరించడం వారిలో భక్తిభావాన్ని పెంచుతోంది. సోమవారం నుంచి దేవీశరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఊరూరా దుర్గామాతను ప్రతిష్ఠించగా, యువకులు పెద్ద ఎత్తున మాలలు ధరించడం విశేషం. చిన్న పిల్లలు, మహిళలు సైతం దుర్గమ్మ సేవపై ఆసక్తితో మాలలు, కండువాలు ధరించారు.

దుర్గామాత మాల అంటే అత్యంత పవిత్రమైంది. దీనిని ధరిస్తే కఠిన నియమాలు పాటించాలి. హరిషడ్వర్గాలు (కామం, క్రోధం, మోహం, లోబం , మదం, మశ్చరం) అదుపులో పెట్టుకోవాలి. నియమనిష్టలతో ఉపవాస పూజలు చేయడంతో ఇది సాధ్యం అవుతుందని పండితులు, పది పర్యాయాలు మాల ధరించిన పెద్దలు చెప్తున్నారు. పిల్లలు చిన్నప్పుడే మాల ధరించడంతో వారిలో భక్తి భావం పెరగడమే కాకుండా క్రమశిక్షణ అలవర్చుకోవడానికి అవకాశముంది. యువత చెడు అలవాట్లను దూరం చేసుకొని మంచి సన్మార్గంలో నడవడం, పనిపై ఏకాగ్రత కూడా పెరుగుతుంది. దుర్గాదేవిని మనసు పెట్టి కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం కలుగడంతో మాలను ధరించే భక్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఈ ఏడాది ప్రతీ ఊరిలో కనీం 50 మందికి తగ్గకుండా మాలలు ధరించారు.

ఏకాగ్రత పెరుగుతుంది



మాలను ధరించి దుర్గామాత ను పూజిస్తే అన్ని విధాలుగా మంచి జరుగుతుంది. యువత ప్రాధాన్యతతో మాలలు వేయడం మంచి తరుణం. దీంతో దురలవాట్లు దూరం అవుతాయి. జపం చేయడంతో ఏకాగ్రత పెరుగుతుంది. శరీర చక్రాలన్నీ యాక్టివ్‌ అవుతాయి.

– గున్నాల నరేశ్‌, పండితులు, డొంకేశ్వర్‌

మంచిని సూచిస్తుంది



దుర్గామాత సేవకు యువత ముందుకు వస్తోంది. ప్రతి ఏడాది వీరి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మాలలు ధరించి నవరాత్రులు నిష్ఠతో పూజలు చేయడంతో వారిలో భక్తి భావం ఏర్పడుతుంది. మాల వలన చెడుకు దూరంగా ఉంచి మంచిని సూచిస్తుంది.

– స్పృచిత్‌కుమార్‌, డొంకేశ్వర్‌

మొదటిసారి వేశా..



దుర్గమ్మను కొలిస్తే అన్ని విధాలుగా మంచి జరుగుతుందని తెలుసుకున్నా. అందుకే నవరాత్రుల సందర్భంగా నేను మొదటి సారిగా మాల వేశాను. నాలాగే చాలా మంది యువకులు ఆసక్తితో మాలను ధరించారు.

– నవీన్‌, డొంకేశ్వర్‌

చిన్నతనం నుంచి ధరిస్తున్నా..



నేను చిన్న వయసు నుంచి దుర్గామాత మాల వేస్తున్నాను. మాల వేయడం వలన భక్తిభావం పెరిగింది. ఆలోచన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. యువత చెడు మార్గాన్ని వదిలి భక్తి మార్గంలో నడిచేందుకు దుర్గా మాల శ్రేయస్కరం.

– విజయ్‌వర్ధన్‌, సీతారాంనగర్‌, నిజామాబాద్‌

ప్రజావాణికి 89 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌తోపాటు నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, మెప్మా పీడీ రాజేందర్‌, ఏసీపీ వెంకటేశ్వర్‌ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట మండలంలోని ఆంధ్రానగర్‌ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం ఆ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని టెలిఫోన్‌ ఎక్స్ఛేంజ్‌ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎలవర్తి రమేశ్‌ అనే వ్యక్తి 12 సంవత్సరాల క్రితం కబ్జాకు పాల్పడ్డారని పే ర్కొన్నారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గల సామగ్రిని దొంగిలించిన వ్యక్తులపై విచారణ చేపట్టాలని కోరారు.

జీఎస్టీ.. మధ్యతరగతికి భారీ ఆదా

జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వస్తువుల ధరలు తగ్గాయి. దీంతో వినియోగదారులు, విద్యార్థులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షితో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పెట్టుబడులకు ప్రోత్సాహం



కొత్త జీఎస్టీ అమలు చేయడం ద్వారా చిన్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. పన్ను సమస్యలు తగ్గి పెటుబడులకు ప్రోత్సాహం కలుగుతుంది. పన్ను మార్పుతో వ్యాపార రంగం పెరుగుతుంది.

– యోగి, వస్త్ర వ్యాపారి

మార్పులను స్వాగతిస్తున్నాం



జీఎస్టీలో సంస్కరణలు, శ్లాబుల మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. శ్లాబ్‌ రేట్లు తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు, రైతులు, చిరువ్యాపారులకు మేలు జరుగుతుంది.

– ఇందూరు లలిత, ప్రభుత్వ టీచర్‌, బోధన్‌

వ్యాపారం పెరుగుతుంది



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో వ్యాపారులకు 20 శాతం మేరకు అదనంగా వ్యాపారం జరుగుతుంది. అన్ని ఎలక్ట్రానిక్‌ వస్తువులపై సీఎస్టీ తగ్గడం మంచి పరిణామం. ముఖ్యంగా సోలార్‌ చాలామంది పెట్టుకుంటున్నారు.

– సీహెచ్‌ వెంకటరమణ, సోలార్‌ వ్యాపారి

మధ్యతరగతికి మేలు



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ఎత్తివేసి మంచి పని చేసింది. ముఖ్యంగా నిత్యావసర వస్తువులపై జీఎస్టీ ఉండేది. ఇప్పుడు జీఎస్టీ లేకపోవడంతో అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గతాయి. తద్వారా ప్రజలకు మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఆదాయం మిగులుతుంది.

– లత, గృహిణి

ఇన్సురెన్స్‌ పాలసీలు చేసుకోవచ్చు



ప్రస్తుతం చాలామంది ఉద్యోగులు హెల్త్‌, టర్మ్‌ పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీలపైన 18 శాతం జీఎస్టీ ఉండేది. ప్రభుత్వం మొత్తం జీఎస్టీ తీసివేసింది. దీంతోపాటు అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– చందర్‌ నాయక్‌, ఉద్యోగి

సామాన్య ప్రజలకు ఉపశమనం



జీఎస్టీ 2.0 సంస్కరణలు సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థోమతను పెంపొందించేలా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టీవీలు, సిమెంటు ధరలపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించటం ద్వారా మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం లభించింది.

– గోపిశెట్టి రాంబాబు, ప్రొఫెసర్‌ తెయూ

బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలి

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ఆస్పత్రులన్నీ బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ల్యాబ్‌లు, స్కానింగ్‌ సెంటర్లు, బ్లడ్‌ బ్యాంకులు ఎక్స్‌రే, క్లినిక్‌లు బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. ధ్రువపత్రం లేకుండా కొనసాగితే చర్యలు తీసుకుంటామన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో ఉన్న బయో మెడికల్‌ వేస్టేజ్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌కి తరలించాలని సూచించారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్‌ కరోలినా చింగ్తియాన్‌ మావీ, సబ్‌ కలెక్టర్లు వికాస్‌ మహతో, అభిజ్ఞాన్‌ మాల్వియా, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస్‌ ప్రసాద్‌, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ లక్ష్మణ్‌ ప్రసాద్‌, మెడికేర్‌ బయో మెడికల్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌ నిర్వాహకులు శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరల్‌ హెపటైటీస్‌ ప్రమాదకరం

- ల్యాబ్‌లు, బ్లడ్‌ బ్యాంకులు రోగుల వివరాలు ఇవ్వాలి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బద్దం రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న వైరల్‌ హెపటైటీస్‌ అనే వ్యాధి ఎయిడ్స్‌ కంటే ప్రమాదకరమైందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల ల్యాబ్‌లు, బ్లడ్‌బ్యాంకులు రోగుల వివరాలు నమోదు చేసి ఇవ్వాలని డీఎంహెచ్‌వో బద్దం రాజశ్రీ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు, బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెపటైటీస్‌ వ్యాపించకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెపటైటీస్‌లో ప్రధానంగా సిర్రోసిస్‌ ఆఫ్‌ లివర్‌, లివర్‌ క్యాన్సర్‌ యాంటీ ప్రమాదకరమైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్‌ కేసులను తెలపాలని పేర్కొన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ తుకారాం రాథోడ్‌ మాట్లాడుతూ వైరల్‌ హెపటైటీస్‌ను 2030 సంవత్సరం వరకు నియంత్రించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేశ్‌, అంజన, సమత, టీహబ్‌ డాక్టర్‌ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంను కలిసిన కామారెడ్డి డీఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌ జ్యోత్స్నని కామారెడ్డి డిపో మేనేజర్‌ దినేశ్‌ కుమార్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల ఖమ్మం డిపో నుంచి కామారెడ్డి డిపోకు బదిలీపై వచ్చారు. గతంలో నిజామాబాద్‌ అసిస్టెంట్‌ డిపో మేనేజర్‌గా పనిచేశారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతిగా పవన్‌ చంద్రారెడ్డి



రుద్రూర్‌: రుద్రూర్‌ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రం అధిపతిగా డా. పవన్‌ చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2007 నుండి 2013 వరకు రుద్రూర్‌ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా సేవలందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఏరువాక కేంద్రానికి బదిలీపై వెళ్లారు. 2017 వరకు ఏరువాక కేంద్రం అధిపతిగా పనిచేశారు. రుద్రూర్‌ పరిశోధన కేంద్రంలో ఆరు నెలలపాటు పదోన్నతిపై సీనియర్‌ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించారు. 2018 నుంచి 2023 వరకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ప్రొఫెసర్‌గా, 2023 నుంచి 2025 వరకు హైదరాబాద్‌లోని నేల ఆరోగ్య యాజమాన్య సంస్థలో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌ చంద్రారెడ్డిని బోధన, బోధనేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఆలోచన అదిరింది..

- రోడ్లపై మక్కల రాసుల వద్ద సూచికలుగా రేడియం డబ్బాలు



మోర్తాడ్‌(బాల్కొండ): అతని ఆలోచన చిన్నదే కానీ.. పెద్ద ప్రమాదాలను నివారించేలా ఉండటంతో వాహనదారుల ప్రశంసలు అందుకుంటున్నాడు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి పక్కన బండరాళ్లు పెడుతుండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మోర్తాడ్‌కు చెందిన పోలోజు శ్రీకాంత్‌ ధాన్యం వద్ద బండరాళ్లకు బదులుగా రేడియం స్టిక్కర్లు ఉన్న డబ్బాలను పెడుతూ వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాడు. మోర్తాడ్‌ నుంచి పాలెం, తిమ్మాపూర్‌, సుంకెట్‌, రామన్నపేట్‌, దొన్కల్‌, రెంజర్ల తదితర ప్రాంతాల్లో వంద రేకు డబ్బాలను సూచికలుగా ఏర్పాటు చేశాడు. రేడియం స్టిక్కర్ల డబ్బాల ఏర్పాటుతో మక్కలు ఆరబోసిన విషయాన్ని గుర్తించి వాహనదారులు నెమ్మదిగా వెళ్లడం జరుగుతుందని శ్రీకాంత్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ద్యాప మహేశ్‌(29) ఉపాధి కోసం గల్ఫ్‌ వెళ్లి రెండేళ్ల క్రితం తిరిగి వచ్చాడు. గల్ఫ్‌లో ఉన్నప్పుడే అతని తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తిరిగి వచ్చాక పెళ్లి చేసుకొని తండ్రిని చూసుకుంటూ ఇక్కడే ఉండిపోవాలని భావించాడు. రెండేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎంతకీ సంబంధం కుదరకపోవడంతో కొద్దిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడి ప్రాణాలతో బయటపడ్డాడని తెలిసింది. ఆదివారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన మహేశ్‌ ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి సాయిలు, ఇతర కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించారు. సమీపంలోని రైలు పట్టాలపై మహేశ్‌ మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఉరేసుకొని ఒకరు..

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజు (45) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కొన్నిరోజులుగా రాజు మద్యానికి బానిసైనట్లు పేర్కొన్నారు. భార్య పుట్టింటికి వెళ్లిందని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో నలుగురికి జైలు



కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి సూచించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన 29 మందిని కోర్టులో హాజరుపర్చగా నలుగురికి జైలు శిక్ష, జరిమానా, మరో 25 మందికి జరిమానాలు విధించింది. వారందరికీ సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో నరహరి కౌన్సిలింగ్‌ నిర్వహించారు. క్రమం తప్పకుండా డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు?

రామారెడ్డి: రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇద్దరు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం బయటకు రానివ్వడం లేదు. కూతురిపై వేధింపులతో తండ్రిపై, ఇదే వ్యవహారంలో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లుగా విశ్వసనీయ సమాచారం.

మర్రి మైసమ్మ ఆలయంలో చోరీ

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాన్ని పగులగొట్టి ఆలయంలోని పూజోపకరణ సామగ్రి, 10 కిలోల ఇత్తడి దీపం, శఠగోపం, యాంప్లిఫైర్‌తోపాటు హుండీలోని నగదును అపహరించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేటలో సోమవారం వర్షం కురుస్తుండటంతో పలువురు రైతులు చెట్టు కింద కూర్చున్నారు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తోందని గ్రహించి కొద్దిదూరం వెళ్లగానే చెట్టుపై పిడుగుపడింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వాకింగ్‌కు వెళ్లి అనంతలోకాలకు..

- చెరువులో పడి పదో తరగతి విద్యార్థి మృతి
- హాస్టల్‌ నుంచి వచ్చిన మరుసటి రోజే ఘటన



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

మద్నూర్‌(జుక్కల్‌): దసరా పండుగకు హాస్టల్‌ నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థి మరుసటి రోజే దుర్మరణం చెందిన ఘటన మద్నూర్‌ మండలం చిన్న ఎక్లారలో సోమవారం చోటు చేసుకుంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కొద్దిసేపటికే చెరువులో పడి చనిపోయాడన్న వార్త తల్లిదండ్రులు, గ్రామస్తులను శోకసంద్రంలో ముంచింది. వివరాలు ఇలా ఉన్నాయి. మద్నూర్‌ మండలంలోని చిన్న ఎక్లార గ్రామానికి చెందిన సంజు హోటల్‌ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంజుకి ఒక కూతురు, కొడుకు సాయిచరణ్‌(15) ఉన్నారు. సాయిచరణ్‌ మద్నూర్‌లోని బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ఉండటంతో ఆదివారం ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వాకింగ్‌ చేసి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సాయిచరణ్‌ గ్రామ శివారులో ఉన్న చెరువులో శవమై కనిపించాడు. కాలకృత్యాల కోసం వెళ్లిన సాయిచరణ్‌ ప్రమాదవశాత్తు చెరువులో ఉన్న పెద్ద గుంతల్లో పడటంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ఇక లేడని తెలుసుకున్న ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని మద్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



మహ్మద్‌ మృతదేహం

బాన్సువాడ రూరల్‌: మండలంలోని మొగులాన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్‌(35) అనే యువకుడు సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. బీర్కూర్‌ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో టైల్స్‌ పని చేస్తుండగా విద్యుత్‌ షాక్‌ తగిలింది. గమనించిన తోటి కార్మికులు మహ్మద్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యు లు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ సీఐ అశోక్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరి పరిస్థితి విషమం



సుశాంత్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలో సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై మహమ్మద్‌ షరీఫ్‌ తెలిపిన వివరాలు ప్రకారం.. ధర్మారం(బి)కి చెందిన సుశాంత్‌(22), మమ్ము అనే ఇద్దరు యువకులు కారులో ప్రధాన రోడ్డుపై అటుఇటుగా ప్రయాణిస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు గమనించి కారులో ఇరుక్కున్న వారిని బయటికి తీశారు. కాగా, కారులో ఉన్న సుశాంత్‌(22) ఘటనా స్థలంలోనే మరణించాడు. తీవ్రంగా గాయపడిన మమ్మును 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మమ్ము పరిస్థితి విషయంగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్‌



నిందితులను చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: బైక్‌ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 19న సిరికొండ మండలం తూంపల్లి గ్రామ పరిధిలోని వర్షిన్‌ తండాకు చెందిన భూక్య విఠల్‌ ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద పార్క్‌ చేసిన తన బైక్‌ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం దేవీరోడ్‌ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా నిర్మల్‌ జిల్లా భైంసాలోని ఓవైసీ నగర్‌కు చెందిన హనువాతే భీమ్‌, హనువాతే సుభాష్‌ దొంగిలించిన బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకొని విచారించగా నగరంలోని 50 క్వార్టర్స్‌లో నివాసముంటూ మద్యం, జల్సాల కోసం బైక్‌ దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. భైంసా, నందిపేట్‌, బాల్కొండ ప్రాంతాల్లో కూడా బైక్‌ దొంగతనాలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. వారి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కాసర్లకు కాళోజీ పురస్కారం



నిజామాబాద్‌ సిటీ: తెలుగు భాషోపాధ్యాయుడు, ప్రముఖ పుస్తక రచయిత, సిర్పూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు కాళోజీ జాతీయ పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో నరేశ్‌రావుకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్‌ అవార్డు అందజేశారు. జిల్లాకు చెందిన మరో కవి చందన్‌రావుకు డాక్టర్‌ సినారె అవార్డు అందుకున్నారు.

రేపు రాష్ట్రస్థాయి పోటీలకు ఫుట్‌బాల్‌ జిల్లా జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24న అండర్‌–19 ఫుట్‌బాల్‌ (బాలుర) జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఐఈవో తిరుమలపుడి రవికుమార్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్‌ కళాశాల స్థాయి బాలురు ఈ పోటీలలో పాల్గొనేందుకు 24న ఉదయం 10 గంటలకు నిజామాబాద్‌లోని రాజారాం స్టేడియానికి తరలిరావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్టు ఈ నెల 25, 26, 27 తేదీల్లో జనగాంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతుంది. సోమవారం గరిష్టంగా 2 లక్షల 54 వేల క్యూసెక్కులు వచ్చిన వరద, క్రమంగా తగ్గు తూ సాయంత్రానికి లక్షా 80 వేల క్యూసెక్కులకు చే రింది. గోదావరిలోకి 39 వరద గేట్ల ద్వారా 2 లక్షల 54 వేల క్యూసెక్కుల నీటిని నిరంతరం వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా 15వేలకు పైగా క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1090.6(78.8 టీఎంసీలు) అడుగుల నీటిమట్టం నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు, కౌలాస్‌ ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి 60,630 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు పది గేట్లను ఎత్తి 77,446 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

సాక్షి నిజామాబాద్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



కొలువు దీరిన అమ్మవారు..

జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో సోమవారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. మండపాల్లో అమ్మవారు కొలువు దీరారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో విద్యుత్‌దీపాలతో వేసిన ఇంద్రకీలాద్రి సెట్టు, 51 శక్తిపీఠాలను సూచిస్తూ ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.

– నిజామబాద్ రూరల్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యూస్‌రీల్

నేడు దిశ సమావేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఆర్డీవో సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాలు నిరంతరం పని చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ఈవీఎంలను భద్రపర్చిన గోదాము వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో హరిసింగ్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఈవీఎం నోడల్ అధికారి ప్రసాద్ తదితరులతో కలిసి నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాము సీల్ ను తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామగ్రి భద్రపర్చి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. వారి వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, జితేందర్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని డిపో–1 మేనేజర్ ఆనంద్, ఆర్టీసీ విజిలెన్స్ సీఐ మహిపాల్ ప్రభాకర్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్యకు విన్నవించారు. సోమవారం సీపీని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. నిజామాబాద్ బస్ స్టేషన్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల గురించి సీపీకి వివరించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా టోర్నీలో సత్తా



నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా టోర్నీలో జిల్లా మహిళల, పురుషుల జట్లు సత్తాచాటాయి. మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 20 నుంచి సోమవారం వరకు 11వ సెపక్ తక్రా సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మహిళల, పురుషుల టోర్నమెంట్ నిర్వహించగా.. జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానంలో, పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాదారి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్ల విజయంపై అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశ వేణు, గాదారి సంజీవరెడ్డితోపాటు ఉపాధ్యక్షులు దీపిక, ల్యాబ్ గంగారెడ్డి, బాగారెడ్డి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మళ్లీ భారీ వర్ష సూచన

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు మళ్లీ భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయగా అందులో నిజామాబాద్ జిల్లా సైతం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా, సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. 4.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా నందిపేట మండలంలో 24.0 మిల్లీ మీటర్లు, నవీపేటలో 15.2. డొంకేశ్వర్‌లో 8.3, సిరికొండలో 10.7, పాతంగల్‌లో 12.3, మోస్రాలో 7.5, సాలూరాలో 8.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తొమ్మిది మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షం కురవగా, 23 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మధ్యతరగతికి భారీ ఆదా

జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వర్గాల్లో సంతోషం

- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపార, ఉద్యోగ, మహిళలు



జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వస్తువుల ధరలు తగ్గనుండడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో 5,18 శాతం శ్లాబులు మాత్రమే ఉండేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వినియోగదారులు, వ్యాపారులు, రైతులు, గృహిణులు, విద్యార్థులు, యువత తమకు భారీగా ఆదా అవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్ల ధరలు భారీగా తగ్గనుండడంతో మధ్యతరగతి వారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలాలపై 40 శాతం జీఎస్టీ విధించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ వర్గాల వారు 'సాక్షి' తో అభిప్రాయాలు పంచుకున్నారు. –సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



రైతులు ఆధునిక పరికరాలు మరింతగా కొనుక్కోవచ్చు



శ్లాబుల ధరలు భారీగా తగ్గించడంతో మానవాళికి అన్నం పెట్టే రైతులకు ఉపయోగకరం. రైతులు మరింతగా యాంత్రీకరణకు వెళ్లవచ్చు. ఆధునిక వ్యవసాయం వైపు వేగంగా వెళ్లేందుకు అవకాశం కలిగింది. ఎఫ్‌పీవోల లావాదేవీలపై పన్నులు లేకపోవడం శుభసూచకం. రైతుల ఉత్పత్తులకు ఎగుమతి సుంకాలు లేకపోవడంతో రైతులు ఎగుమతి దారులుగా మారుతారు.

– పొట్కూరి తిరుపతిరెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్

మధ్యతరగతి కుటుంబాలకు లాభమే



డిచ్‌పల్లి: ఇండ్లలో వినియోగించే ఎన్నో రకాల సామగ్రిపై జీఎస్టీ భారం తగ్గించడం మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో లాభం. తక్కువ సొమ్ముకు ఎక్కువ సామగ్రి కొనుక్కోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించడం సంతోషంగా ఉంది.

– లోకాని స్వప్న, ఇందల్వాయి



ఆత్మనిర్భర్ భారత్ దిశగా..



సామాన్యుడు, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగేందుకు ఈ జీఎస్టీ తగ్గింపు శ్లాబులు ఉపయోగపడతాయి. అదేవిధంగా స్వదేశీ ఉత్పత్తులకు మరింత వైభవం తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం కచ్చితమైన ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ఆత్మనిర్భర్‌తోనే వికసిత భారత్ సాధ్యం అవుతుంది. విద్యార్థులకు ఉపయోగపడే స్టేషనరీ లాంటి వస్తువులకు జీరో ట్యాక్స్, ఆరోగ్య బీమాకు పన్ను లేకుండా చేశారు. గ్రాసరీస్, కిరాణా, వ్యవసాయ పరికరాలు, ఔషధాలపై 5 శాతానికి పన్ను తగ్గించారు. చిన్న కార్లు, బైకులు, కంప్యూటర్లు, వివిధ రకాల గృహోపకరణాలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలకు మరింత మేలు కలుగనుంది. – అర్వింద్, ఎంపీ

జీఎస్టీ తగ్గింపు ఊరటనిచ్చే అంశం





అనేక రకాల సామగ్రిపై జీఎస్టీ తగ్గించడం ఎంతో ఊరటనిచ్చే అంశం. జీఎస్టీ తగ్గింపు వల్ల ధరలు తగ్గడంతో పాటు కొనుగోళ్లు పెరగడానికి అవకాశం ఉంది. సామాన్యులకు ఆర్థిక భారం తగ్గుతుంది. విలాసవంతమైన సామగ్రిపై జీఎస్టీ భారం ఉన్నా మధ్య తరగతి వారికి ఎలాంటి ఇబ్బంది లేదు.

– లక్ష్మీనారాయణ, లెక్చరర్, జూనియర్ కళాశాల మోర్తాడ్

ఆటో మొబైల్ రంగానికి ఊపు





వాహనాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ఆటో మొబైల్ రంగానికి ఊపు వస్తుంది. వాహనాల ధరలు తగ్గడంతో సామాన్యులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ఆహార పదార్థాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా సామాన్యులకు మాత్రం మంచి విషయం.

– జక్కం అశోక్, ఆటోమొబైల్స్ వ్యాపారి, మోర్తాడ్

నిత్యావసరాల ధరలు తగ్గడం సంతోషం





మెడికల్ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు మహిళలకు ఆర్థికభారం తగ్గించే మార్గం సంతోషంగా ఉంది. పేద, మధ్య తరగతుల ప్రజలకు ఆర్థిక భారం తగ్గడంతో కుటుంబ నిర్వహణ సులభతరం అవుతుంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

– రాజమణి, ఆర్మూర్

తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలి

- తగ్గిన ట్యాక్స్ వివరాలను బోర్డులపై ప్రదర్శించాలి
- రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె. హరిత



నిజామాబాద్‌నాగారం: జీఎస్టీ తగ్గిన వివరాలు అందరికీ అర్థమయ్యేలా వ్యాపారులు బోర్డులపై ప్రదర్శించాలని, అధికారులు మరింత అవగాహన కల్పించాలని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ కె హరిత అన్నారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన కమిషనర్.. డివిజన్ పరిధిలో పన్నుల వివరాలు, ఆదాయ లక్ష్య సాధన, జీఎస్టీలో ఇటీవల జరిగిన మార్పులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిటర్నులు సమయానికి, సక్రమంగా దాఖలు చేయాలన్నారు. వినియోగదారులకు ఆ ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. బోధన్ చలాన్ స్కామ్‌కు సంబంధించిన పాత బకాయిలపై సమీక్షిస్తూ.. కచ్చితంగా చెల్లించాల్సిందేనని రైస్‌మిల్లర్స్‌ను ఆదేశించారు. తక్షణమే పెండింగ్ బకాయిలు క్లియర్ చేయాలన్నారు. చెల్లించని వారికి ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయన్నారు. చెక్కుల కేసులను సర్కిల్ వారీగా సమీక్షించిన కమిషనర్.. వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాయింట్ కమిషనర్ గోపాల్‌రావు, మేనేజర్ ఈశ్వర్, సీటీవోలు, ఏసీటీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించాలి

- వైభవంగా బతుకమ్మ సంబురాలు
- అన్ని శాఖలు భాగస్వాములు కావాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ సంబురాలను జిల్లాలో వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా శాఖల జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ బతుకమ్మ వేడుకల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నేపథ్యంలో జిల్లాలో వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేయాలని, ముఖ్య కూడళ్లు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రదేశాల్లో హోర్డింగ్స్, బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలతోపాటు నిమజ్జనం చేసే నీటి వనరుల వద్ద లైటింగ్, సౌండ్ సిస్టమ్ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 26వ తేదీన ఎడపల్లి మండలం అలీసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్వహించనున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, పెద్ద ఎత్తున మహిళలు, యువతులు, బాలికలతోపాటు మహిళా ఉద్యోగులు పాల్గొనేలా చూడాలని, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఉత్సవాల్లో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని, ప్రతి రోజూ ఒక శాఖ తరఫున బతుకమ్మ పండుగను నిర్వహించాలన్నారు. 30వ తేదీన సద్దుల బతుకమ్మను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో రాజశ్రీ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేశ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం ఉత్సాహంగా..

- సంస్కృతి సంప్రదాయల వైభవాన్ని చాటుతూ సంబురాలు
- బతుకమ్మ, దేవీ నవరాత్రులు, శ్రీరామనవమి..
- పండగ ఏదైనా పెరుగుతున్న ప్రాధాన్యం
- ఇందూరుకు ప్రత్యేకం వీరహనుమాన్ విజయయాత్ర, ఊర పండుగ



బతుకమ్మలతో రెడ్డి రీఫామ్ సొసైటీ సభ్యులు



లక్ష్మి కల్యాణ మండపంలో బతుకమ్మ ఆడుతున్న రెడ్డి రీఫామ్ సొసైటీ సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కేంద్రంలో స్థానికంగా ఉన్న వివిధ వర్గాల ప్రజలతోపాటు దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తున్నారు. దీంతో ఉత్సవం ఏదైనా ఉత్సాహంగా, ఘనంగా నిర్వహిస్తున్నారు. భవసార్ క్షత్రియ సమాజ్, సింధీ, మార్వాడీ సమాజ్‌ల ఆధ్వర్యంలో చేసే పండుగలకు ప్రాధాన్యం ఉంటోంది. దీంతో దుర్గా నవరాత్రులు, గణపతి ఉత్సవాలు, శ్రీరామనవమి, శివరాత్రి, హోళీ ఉత్సవాలను కలసికట్టుగా చేసుకుంటున్నారు. ఇక ఇందూరుకే ప్రత్యేకమైన ఊర పండుగ, వీరహనుమాన్ విజయ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే రాష్ట్రంలో సంప్రదాయ ఉత్సవమైన బతుకమ్మ ఉత్సవాల విషయంలో మాత్రం జిల్లాలో రానురాను మరింత కళ వస్తోంది. మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ ఉత్సవాలు చేసుకుంటున్నారు. ఇందుకోసం భారీ స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కమిటీలు వేసుకుంటున్నారు.

రెడ్డి రీఫామ్ ఆధ్వర్యంలో బతుకమ్మ

నగరంలోని లక్ష్మి కల్యాణ మండపంలో రెడ్డి రీఫామ్ మహిళల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టాయి. మాజీ ఎంపీ కేశ్‌పల్లి గంగారెడ్డి సతీమణి లక్ష్మీకాంతమ్మకు వచ్చిన ఆలోచనతో రెడ్డి రీఫామ్ సొసైటీ ఏర్పాటు చేశారు. రెడ్డి కులస్తులు ఆడంబరంగా నిర్వహిస్తున్న శుభకార్యాలు, వివాహాలకు భారీ ఖర్చు చేస్తున్నారని, ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు ప్లాస్టిక్ నిషేధంలో తమవంతు పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. వంటలు సైతం ఎక్కువగా చేసి ఆహారాన్ని వృథా చేయొద్దనే నినాదాన్ని వినిపించేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ఆస్తులు అమ్ముకునే స్థాయిలో వేడుకలు చేయొద్దని ప్రచారం చేస్తున్నారు. 'సింపుల్ వెడ్డింగ్, సింపుల్ లివింగ్, సింపుల్ ఈటింగ్, విమెన్ వెల్ఫేర్, స్టూడెంట్ వెల్ఫేర్' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారు. బతుకమ్మ వేడుకల్లో లక్ష్మీకాంతమ్మ, ఇందిరారెడ్డి, సరళ మహేందర్‌రెడ్డి, డాక్టర్ కవితారెడ్డి, నల్ల స్రవంతిరెడ్డి, విశాలిని రెడ్డి, సృజనరెడ్డి, సౌజన్యరెడ్డి, సంగీతరెడ్డి, స్వరూపారెడ్డి, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉండేందుకే..



రెడ్డిల్లోని పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ సొసైటీ స్థాపించాం. పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చే లక్ష్యంతో సమష్టిగా ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్తున్నాం.

– ఇందిరారెడ్డి, రెడ్డి రీఫామ్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు

సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యం



సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తూ ధనిక, పేద, మధ్యతరగతి అనే తేడా లేకుండా అన్ని పండుగలు కలసికట్టుగా చేసుకోవాలనే విధంగా సొసైటీ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నాం. కుటుంబ కార్యక్రమాలను ఆడంబరంగా కాకుండా సాధారణంగా నిర్వహిస్తూ డబ్బులు వృథా చేయకుండా చూస్తాం.

– సరళ మహేందర్‌రెడ్డి, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి

సామాజిక స్పృహతో..



రెడ్డి సమాజంలో మహిళలు సామాజిక స్పృహతో ముందుకెళ్లాలనే లక్ష్యంతో ఈ సొసైటీని ఏర్పాటు చేశాం. వ్యక్తిగత, కుటుంబ వేడుకలు, వివాహాలు ఆర్భాటంగా, ఆడంబరంగా చేసి డబ్బులు వృథా చేయడానికి బదులు పిల్లల చదువుకు ఉపయోగించాలని, పేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సొసైటీ పనిచేసేందుకు సూచనలు ఇచ్చాను.

– లక్ష్మీకాంతమ్మ, సొసైటీ ఫౌండర్

భూసేకరణను నెలాఖరులోగా పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, తదితరులు

నిజామాబాద్‌అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన స్థల సేకరణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సీఎం సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దసరాకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూములకు పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో వికాస్‌మీనా, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, ప్రగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్‌ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలో ఓపెన్‌ ఇంటర్, పది సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఓపెన్‌ 10వ తరగతి పరీక్షల్లో భాగంగా నిర్వహించిన తెలుగు పరీక్ష 38 మంది రాయగా 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఓపెన్‌ ఇంటర్‌ పరీక్షలకు 86 మంది హాజరుకాగా, 23 మంది గైర్హాజరయ్యారు.

దుర్గామాతకు సీపీ పూజలు



ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్స్‌ దుర్గా పరమేశ్వరీ మాత మందిరంలో మొదటి రోజు సోమవారం బాల త్రిపుర సుందరి అమ్మవారికి నిర్వహించిన పూజలో సీపీ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నవరాత్రులు నూతన శక్తి , భక్తి , విజయానికి ప్రతీకలన్నారు. ఉత్సవాలు సమాజంలో శాంతి, సామరస్యత, సద్భావనలకు దోహదపడతాయన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్‌) బస్వారెడ్డి, రిజర్వ్‌ సీఐ శ్రీనివాస్‌ (అడ్మిన్‌), ఎంటీవో శేఖర్‌ బాబు, తిరుపతి (వెల్ఫేర్‌), సతీశ్‌ (హోంగార్డ్స్‌), ప్రధాన అర్చకులు జోషి వెంకటేశ్‌ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో యువత

- దుర్గామాతకు ఏటా పెరుగుతున్న భక్తులు
- మాలధారణతో క్రమశిక్షణ, భక్తిభావం
- పిల్లలు, మహిళల్లో సైతం దుర్గమ్మ సేవపై ఆసక్తి



డొంకేశ్వర్‌లో మాల ధరించిన యువకులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఆది పరాశక్తిగా భావించే దుర్గామాతకు ఏటా భక్తులు పెరుగుతున్నారు. యువత ఎక్కువ సంఖ్యలో మాలను ధరించడం వారిలో భక్తిభావాన్ని పెంచుతోంది. సోమవారం నుంచి దేవీశరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఊరూరా దుర్గామాతను ప్రతిష్ఠించగా, యువకులు పెద్ద ఎత్తున మాలలు ధరించడం విశేషం. చిన్న పిల్లలు, మహిళలు సైతం దుర్గమ్మ సేవపై ఆసక్తితో మాలలు, కండువాలు ధరించారు.

దుర్గామాత మాల అంటే అత్యంత పవిత్రమైంది. దీనిని ధరిస్తే కఠిన నియమాలు పాటించాలి. హరిషడ్వర్గాలు (కామం, క్రోధం, మోహం, లోబం , మదం, మశ్చ్యరం) అదుపులో పెట్టుకోవాలి. నియమనిష్టలతో ఉపవాస పూజలు చేయడంతో ఇది సాధ్యం అవుతుందని పండితులు, పది పర్యాయాలు మాల ధరించిన పెద్దలు చెప్తున్నారు.

పిల్లలు చిన్నప్పుడే మాల ధరించడంతో వారిలో భక్తి భావం పెరగడమే కాకుండా క్రమశిక్షణ అలవర్చుకోవడానికి అవకాశముంది. యువత చెడు అలవాట్లను దూరం చేసుకొని మంచి సన్మార్గంలో నడవడం, పనిపై ఏకాగ్రత కూడా పెరుగుతుంది. దుర్గాదేవిని మనసు పెట్టి కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం కలుగడంతో మాలను ధరించే భక్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఈ ఏడాది ప్రతీ ఊరిలో కనీం 50 మందికి తగ్గకుండా మాలలు ధరించారు.

ఏకాగ్రత పెరుగుతుంది



మాలను ధరించి దుర్గామాత ను పూజిస్తే అన్ని విధాలుగా మంచి జరుగుతుంది. యువత ప్రాధాన్యతతో మాలలు వేయడం మంచి తరుణం. దీంతో దురలవాట్లు దూరం అవుతాయి. జపం చేయడంతో ఏకాగ్రత పెరుగుతుంది. శరీర చక్రాలన్నీ యాక్టివ్‌ అవుతాయి.

– గున్నాల నరేశ్, పండితులు, డొంకేశ్వర్‌

మంచిని సూచిస్తుంది



దుర్గామాత సేవకు యువత ముందుకు వస్తోంది. ప్రతి ఏడాది వీరి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మాలలు ధరించి నవరాత్రులు నిష్ఠతో పూజలు చేయడంతో వారిలో భక్తి భావం ఏర్పడుతుంది. మాల వలన చెడుకు దూరంగా ఉంచి మంచిని సూచిస్తుంది.

– స్వచిత్‌కుమార్, డొంకేశ్వర్‌

మొదటిసారి వేశా..



దుర్గమ్మను కొలిస్తే అన్ని విధాలుగా మంచి జరుగుతుందని తెలుసుకున్నా. అందుకే నవరాత్రుల సందర్భంగా నేను మొదటి సారిగా మాల వేశాను. నాలాగే చాలా మంది యువకులు ఆసక్తితో మాలను ధరించారు.

– నవీన్, డొంకేశ్వర్‌

చిన్నతనం నుంచి ధరిస్తున్నా..



నేను చిన్న వయసు నుంచి దుర్గామాత మాల వేస్తున్నాను. మాల వేయడం వలన భక్తిభావం పెరిగింది. ఆలోచన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. యువత చెడు మార్గాన్ని వదిలి భక్తి మార్గంలో నడిచేందుకు దుర్గా మాల శ్రేయస్కరం.

– విజయ్‌వర్ధన్, సీతారాంనగర్, నిజామాబాద్‌

ప్రజావాణికి 89 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌ కుమార్‌తోపాటు నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్‌ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట మండలంలోని ఆంధ్రానగర్‌ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం ఆ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని టెలిఫోన్‌ ఎక్స్ఛేంజ్‌ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎలవర్తి రమేశ్‌ అనే వ్యక్తి 12 సంవత్సరాల క్రితం కబ్జాకు పాల్పడ్డారని పే ర్కొన్నారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గల సామగ్రిని దొంగిలించిన వ్యక్తులపై విచారణ చేపట్టాలని కోరారు.

జీఎస్టీ.. మధ్యతరగతికి భారీ ఆదా

జీఎస్టీ కొత్త శ్లాబుల అమలుతో వివిధ వస్తువుల ధరలు తగ్గాయి. దీంతో వినియోగదారులు, విద్యార్థులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షితో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పెట్టుబడులకు ప్రోత్సాహం



కొత్త జీఎస్టీ అమలు చేయడం ద్వారా చిన్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. పన్ను సమస్యలు తగ్గి పెటుబడులకు ప్రోత్సాహం కలుగుతుంది. పన్ను మార్పుతో వ్యాపార రంగం పెరుగుతుంది.

– యోగి, వస్త్ర వ్యాపారి

మార్పులను స్వాగతిస్తున్నాం



జీఎస్టీలో సంస్కరణలు, శ్లాబుల మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. శ్లాబ్‌ రేట్లు తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు, రైతులు, చిరువ్యాపారులకు మేలు జరుగుతుంది.

– ఇందూరు లలిత, ప్రభుత్వ టీచర్, బోధన్‌

వ్యాపారం పెరుగుతుంది



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో వ్యాపారులకు 20 శాతం మేరకు అదనంగా వ్యాపారం జరుగుతుంది. అన్ని ఎలక్ట్రానిక్‌ వస్తువులపై సీఎస్టీ తగ్గడం మంచి పరిణామం. ముఖ్యంగా సోలార్‌ చాలామంది పెట్టుకుంటున్నారు.

– సీహెచ్‌ వెంకటరమణ, సోలార్‌ వ్యాపారి

మధ్యతరగతికి మేలు



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ఎత్తివేసి మంచి పని చేసింది. ముఖ్యంగా నిత్యావసర వస్తువులపై జీఎస్టీ ఉండేది. ఇప్పుడు జీఎస్టీ లేకపోవడంతో అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గుతాయి. తద్వారా ప్రజలకు మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఆదాయం మిగులుతుంది.

– లత, గృహిణి

ఇన్సురెన్స్‌ పాలసీలు చేసుకోవచ్చు



ప్రస్తుతం చాలామంది ఉద్యోగులు హెల్త్, టర్మ్‌ పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీల పైన 18 శాతం జీఎస్టీ ఉండేది. ప్రభుత్వం మొత్తం జీఎస్టీ తీసివేసింది. దీంతోపాటు అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– చందర్‌ నాయక్, ఉద్యోగి

సామాన్య ప్రజలకు ఉపశమనం



జీఎస్టీ 2.0 సంస్కరణలు సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థోమతను పెంపొందించేలా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టీవీలు, సిమెంటు ధరలపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించటం ద్వారా మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం లభించింది.

– గోపిశెట్టి రాంబాబు, ప్రొఫెసర్‌ తెయూ

బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలి

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ఆస్పత్రులన్నీ బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ల్యాబ్‌లు, స్కానింగ్‌ సెంటర్లు, బ్లడ్‌ బ్యాంకులు ఎక్స్‌రే, క్లినిక్‌లు బయో మెడికల్‌ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. ధ్రువపత్రం లేకుండా కొనసాగితే చర్యలు తీసుకుంటామన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో ఉన్న బయో మెడికల్‌ వేస్టేజ్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌కి తరలించాలని సూచించారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్‌ కరోలినా చింగ్తియాన్‌ మావీ, సబ్‌ కలెక్టర్లు వికాస్‌ మహతో, అభిజ్ఞాన్‌ మాల్వియా, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస్‌ ప్రసాద్, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు, పాల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ లక్ష్మణ్‌ ప్రసాద్, మెడికేర్‌ బయో మెడికల్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌ నిర్వాహకులు శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరల్‌ హెపటైటీస్‌ ప్రమాదకరం

- ల్యాబ్‌లు, బ్లడ్‌ బ్యాంకులు రోగుల వివరాలు ఇవ్వాలి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బద్దం రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న వైరల్‌ హెపటైటీస్‌ అనే వ్యాధి ఎయిడ్స్‌ కంటే ప్రమాదకరమైందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల ల్యాబ్‌లు, బ్లడ్‌బ్యాంకులు రోగుల వివరాలు నమోదు చేసి ఇవ్వాలని డీఎంహెచ్‌వో బద్దం రాజశ్రీ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు, బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెపటైటీస్‌ వ్యాపించకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెపటైటీస్‌లో ప్రధానంగా సిర్రోసిస్‌ ఆఫ్‌ లివర్, లివర్‌ క్యాన్సర్‌ యాంటీ ప్రమాదకరమైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్‌ కేసులను తెలపాలని పేర్కొన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ తుకారాం రాథోడ్‌ మాట్లాడుతూ వైరల్‌ హెపటైటీస్‌ను 2030 సంవత్సరం వరకు నియంత్రించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేశ్, అంజన, సమత, టీహబ్‌ డాక్టర్‌ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంను కలిసిన కామారెడ్డి డీఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌ జ్యోత్స్నని కామారెడ్డి డిపో మేనేజర్‌ దినేశ్‌ కుమార్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల ఖమ్మం డిపో నుంచి కామారెడ్డి డిపోకు బదిలీపై వచ్చారు. గతంలో నిజామాబాద్‌ అసిస్టెంట్‌ డిపో మేనేజర్‌గా పనిచేశారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతిగా పవన్‌ చంద్రారెడ్డి



రుద్రూర్‌: రుద్రూర్‌ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రం అధిపతిగా డా. పవన్‌ చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2007 నుండి 2013 వరకు రుద్రూర్‌ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా సేవలందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఏరువాక కేంద్రానికి బదిలీపై వెళ్లారు. 2017 వరకు ఏరువాక కేంద్రం అధిపతిగా పనిచేశారు. రుద్రూర్‌ పరిశోధన కేంద్రంలో ఆరు నెలలపాటు పదోన్నతిపై సీనియర్‌ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించారు. 2018 నుంచి 2023 వరకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్‌ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా, 2023 నుంచి 2025 వరకు హైదరాబాద్‌లోని నేల ఆరోగ్య యాజమాన్య సంస్థలో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌ చంద్రారెడ్డిని బోధన, బోధనేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఆలోచన అదిరింది..

- రోడ్లపై మక్కల రాసుల వద్ద సూచికలుగా రేడియం డబ్బాలు



మోర్తాడ్‌(బాల్కొండ): అతని ఆలోచన చిన్నదే కానీ.. పెద్ద ప్రమాదాలను నివారించేలా ఉండటంతో వాహనదారుల ప్రశంసలు అందుకుంటున్నాడు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి పక్కన బండరాళ్లు పెడుతుండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మోర్తాడ్‌కు చెందిన పోలోజు శ్రీకాంత్‌ ధాన్యం వద్ద బండరాళ్లకు బదులుగా రేడియం స్టిక్కర్లు ఉన్న డబ్బాలను పెడుతూ వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాడు. మోర్తాడ్‌ నుంచి పాలెం, తిమ్మాపూర్, సుంకెట్, రామన్నపేట్, దొన్కల్, రెంజర్ల తదితర ప్రాంతాల్లో వంద రేకు డబ్బాలను సూచికలుగా ఏర్పాటు చేశాడు. రేడియం స్టిక్కర్ల డబ్బాల ఏర్పాటుతో మక్కలు ఆరబోసిన విషయాన్ని గుర్తించి వాహనదారులు నెమ్మదిగా వెళ్లడం జరుగుతుందని శ్రీకాంత్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ద్యావ మహేశ్‌(29) ఉపాధి కోసం గల్ఫ్‌ వెళ్లి రెండేళ్ల క్రితం తిరిగి వచ్చాడు. గల్ఫ్‌లో ఉన్నప్పుడే అతని తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తిరిగి వచ్చాక పెళ్లి చేసుకొని తండ్రిని చూసుకుంటూ ఇక్కడే ఉండిపోవాలని భావించాడు. రెండేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎంతకీ సంబంధం కుదరకపోవడంతో కొద్దిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడి ప్రాణాలతో బయటపడ్డాడని తెలిసింది. ఆదివారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన మహేశ్‌ ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి సాయిలు, ఇతర కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించారు. సమీపంలోని రైలు పట్టాలపై మహేశ్‌ మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఉరేసుకొని ఒకరు..

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజు (45) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కొన్నిరోజులుగా రాజు మద్యానికి బానిసైనట్లు పేర్కొన్నారు. భార్య పుట్టింటికి వెళ్లిందని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో నలుగురికి జైలు



కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి సూచించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన 29 మందిని కోర్టులో హాజరుపర్చగా నలుగురికి జైలు శిక్ష, జరిమానా, మరో 25 మందికి జరిమానాలు విధించింది. వారందరికీ సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో నరహరి కౌన్సిలింగ్‌ నిర్వహించారు. క్రమం తప్పకుండా డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు?

రామారెడ్డి: రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇద్దరు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం బయటకు రానివ్వడం లేదు. కూతురిపై వేధింపులతో తండ్రిపై, ఇదే వ్యవహారంలో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లుగా విశ్వసనీయ సమాచారం.

మర్రి మైసమ్మ ఆలయంలో చోరీ

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాన్ని పగులగొట్టి ఆలయంలోని పూజోపకరణ సామగ్రి, 10 కిలోల ఇత్తడి దీపం, శఠగోపం, యాంప్లిఫైర్‌తోపాటు హుండీలోని నగదును అపహరించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేటలో సోమవారం వర్షం కురుస్తుండటంతో పలువురు రైతులు చెట్టు కింద కూర్చున్నారు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తోందని గ్రహించి కొద్దిదూరం వెళ్లగానే చెట్టుపై పిడుగుపడింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వాకింగ్‌కు వెళ్లి అనంతలోకాలకు..

- చెరువులో పడి పదో తరగతి విద్యార్థి మృతి
- హాస్టల్‌ నుంచి వచ్చిన మరుసటి రోజే ఘటన



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

మద్నూర్‌(జుక్కల్‌): దసరా పండుగకు హాస్టల్‌ నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థి మరుసటి రోజే దుర్మరణం చెందిన ఘటన మద్నూర్‌ మండలం చిన్న ఎక్లారలో సోమవారం చోటు చేసుకుంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కొద్దిసేపటికే చెరువులో పడి చనిపోయాడన్న వార్త తల్లిదండ్రులు, గ్రామస్తులను శోకసంద్రంలో ముంచింది. వివరాలు ఇలా ఉన్నాయి. మద్నూర్‌ మండలంలోని చిన్న ఎక్లార గ్రామానికి చెందిన సంజు హోటల్‌ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంజుకి ఒక కూతురు, కొడుకు సాయిచరణ్‌(15) ఉన్నారు. సాయిచరణ్‌ మద్నూర్‌లోని బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ఉండటంతో ఆదివారం ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వాకింగ్‌ చేసి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సాయిచరణ్‌ గ్రామ శివారులో ఉన్న చెరువులో శవమై కనిపించాడు. కాలకృత్యాల కోసం వెళ్లిన సాయిచరణ్‌ ప్రమాదవశాత్తు చెరువులో ఉన్న పెద్ద గుంతల్లో పడటంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ఇక లేడని తెలుసుకున్న ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని మద్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



మహ్మద్‌ మృతదేహం

బాన్సువాడ రూరల్‌: మండలంలోని మొగులాన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్‌(35) అనే యువకుడు సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. బీర్కూర్‌ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో టైల్స్‌ పని చేస్తుండగా విద్యుత్‌ షాక్‌ తగిలింది. గమనించిన తోటి కార్మికులు మహ్మద్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యు లు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ సీఐ అశోక్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరి పరిస్థితి విషమం



సుశాంత్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలో సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై మహమ్మద్‌ షరీఫ్‌ తెలిపిన వివరాలు ప్రకారం.. ధర్మారం(బి)కి చెందిన సుశాంత్‌(22), మమ్ము అనే ఇద్దరు యువకులు కారులో ప్రధాన రోడ్డుపై అటుఇటుగా ప్రయాణిస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు గమనించి కారులో ఇరుక్కున్న వారిని బయటికి తీశారు. కాగా, కారులో ఉన్న సుశాంత్‌(22) ఘటనా స్థలంలోనే మరణించాడు. తీవ్రంగా గాయపడిన మమ్మును 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మమ్ము పరిస్థితి విషయంగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్‌



నిందితులను చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: బైక్‌ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 19న సిరికొండ మండలం తూంపల్లి గ్రామ పరిధిలోని వర్జిన్‌ తండాకు చెందిన భూక్య విఠల్‌ ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద పార్క్‌ చేసిన తన బైక్‌ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం దేవీరోడ్‌ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా నిర్మల్‌ జిల్లా భైంసాలోని ఓవైసీ నగర్‌కు చెందిన హనువాతే భీమ్, హనువాతే సుభాష్‌ దొంగిలించిన బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకొని విచారించగా నగరంలోని 50 క్వార్టర్స్‌లో నివాసముంటూ మద్యం, జల్సాల కోసం బైక్‌ దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. భైంసా, నందిపేట్, బాల్కొండ ప్రాంతాల్లో కూడా బైక్‌ దొంగతనాలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. వారి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కాసర్లకు కాళోజీ పురస్కారం



నిజామాబాద్‌ సిటీ: తెలుగు భాషోపాధ్యాయుడు, ప్రముఖ పుస్తక రచయిత, సిర్పూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు కాళోజీ జాతీయ పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో నరేశ్‌రావుకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్‌ అవార్డు అందజేశారు. జిల్లాకు చెందిన మరో కవి చందన్‌రావుకు డాక్టర్‌ సినారె అవార్డు అందుకున్నారు.

రేపు రాష్ట్రస్థాయి పోటీలకు ఫుట్‌బాల్‌ జిల్లా జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24న అండర్‌–19 ఫుట్‌బాల్‌ (బాలుర) జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఐఈవో తిరుమలపుడి రవికుమార్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్‌ కళాశాల స్థాయి బాలురు ఈ పోటీలలో పాల్గొనేందుకు 24న ఉదయం 10 గంటలకు నిజామాబాద్‌లోని రాజారాం స్టేడియానికి తరలిరావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్టు ఈ నెల 25, 26, 27 తేదీల్లో జనగాంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతుంది. సోమవారం గరిష్టంగా 2 లక్షల 54 వేల క్యూసెక్కులు వచ్చిన వరద, క్రమంగా తగ్గు తూ సాయంత్రానికి లక్షా 80 వేల క్యూసెక్కులకు చే రింది. గోదావరిలోకి 39 వరద గేట్ల ద్వారా 2 లక్షల 54 వేల క్యూసెక్కుల నీటిని నిరంతరం వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా 15వేలకు పైగా క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1090.6(78.8 టీఎంసీలు) అడుగుల నీటిమట్టం నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు, కౌలాస్‌ ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి 60,630 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు పది గేట్లను ఎత్తి 77,446 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.